న్యూజర్సీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

## ఆమె బాపు గీసిన బొమ్మలా వుంది.

**వీధి వాకిట్లో నిలబడి చారెడేసి కళ్ళతో అతని కోసం ఎదురుచూపులు చూస్తూన్న ఆమె పున్నమి చందమామలా వుంది.**



# శిక్ష

పీసపాటి చంద్రశేఖర్

'లతా! ఎంతసేపు అలా వీధి వాకిట్లో నిలబడి ఎదురుచూస్తావే పిచ్చి తల్లీ. వీధి చివరికి వచ్చినవాడు ఇంట్లోకి రాకుండా వుంటాడా!' అంటూ పళ్ళెంలోని బియ్యం ఏరసాగింది అత్తగారు ధనలక్ష్మి.

'పాత రోజులు గుర్తుకు తెచ్చుకోవోయ్! మన పెళ్లయిన కొత్తలో నన్ను ఆఫీసుకు పంపించి అక్కడే అరుగుమీద సాయంత్రం దాకా నా కోసం ఎదురుచూపులు చూస్తూ నువ్వు పడిన అవస్థ గుర్తుకుతెచ్చుకో. పెళ్లయి వారం రోజులైనా కాలేదు. పిల్లకెలా వుంటుంది మరి!' అంటూ చదువుతున్న పేపరులోంచి దృష్టి మరల్చకుండా వార్తలు చదువుతున్నట్టుగా మాట్లాడేసాడు భూషణం.

భర్త మాటలు ధనలక్ష్మిని ముప్పై ఏళ్ళు వెనక్కినెట్టి ఆమె వెన్నులో చిన్న తియ్యటి షాక్ పుట్టించి, ఒళ్ళు జలదరింపచేసి వర్తమానంలోకి తీసుకొచ్చి దింపాయి.

లత నెమ్మదిగా తన పడక గదిలోకి చేరుకుంది. మంచంపై నడుం వాల్చింది. ఏమీ తోచనిదానిలా అటూ యిటూ దొర్లింది. నిలువుటద్దం ముందు నిలబడి తనని తాను పరిశీలనగా చూసుకుంది.

ఎదురుతెన్నులు చూసి చూసి అలసిపోయిన కళ్లు నీరసంగా కన్పించాయి.

ఆమె దృష్టి ప్రక్కనే వున్న ఫోటో ఫ్రేం మీద పడింది. మహారాజులా గర్వంగా నవ్వుతూ తన వంకే చూస్తున్న భర్త ముఖం చూసింది. సిగ్గుతో ముఖానికి అరచేతులు చాటువేసి తల దించుకొంది. మళ్లీ చూసింది. అతనలాగే నవ్వుతున్నాడు.

ఆఫీసుకు వెళ్తూ వెళ్తూ చెప్పిన అతని మాటలు గుర్తుకొచ్చాయి.

''సూర్యుడుండగానే ఇంటికి చేరుకుంటాము. ఇద్దరం కలిసి నీరెండలో గువ్వల్లా హాయిగా ఎగిరిపోయి, మహారాజ భవనంలాంటి సినిమా హాల్లో సెటిలయిపోయి, అట్నుంచి అటే స్టార్ హోటల్లో భోజనం.....ఆపైన.......''

ఆపైన సిగ్గుతో అతని మాటలు గుర్తుచేసుకోలేకపోయింది. అరవిరిసిన అతివ కాస్తా మొగ్గలా ముడుచుకుపోయింది.

మళ్లీ బయట వాకిలిలోకి వచ్చి, ఎదురుచూపులు చూడసాగింది.

''చల్లబడ్డాక ఎక్కడికైనా వెళ్దామని చెప్పి వెళ్లాడేవిటమ్మా రామకృష్ణుడూ!'' నిప్పులు కక్కుతూన్న పుగాకు చుట్టని పెదాల మధ్య అతి లాఘవంగా త్రిప్పుతూ అడిగాడు భూషణం.

విరుచీకట్లు కమ్ముకొస్తున్న ఆ తరుణంలో ఆ తరుణి ముఖం సిగ్గుతో రవి బింబంలా మారింది.

''వాడొక బడుద్ధాయమ్మా. ఆఫీసుకి పోయా డంటే వాడికి ఆకలితో బాటు ప్రపంచమంతా కూడా మరుపుకు వచ్చేస్తుంది. వచ్చాక నేను మందలిస్తామలే. నువ్వు లోపలికి వెళ్లమ్మా'' అంది ధనలక్ష్మి.

ఉస్సురంటూ లోనికి వెళ్ళి మంచం మీద వాలిపోయింది లత. ఆమెలో నిరాశ పూర్తిగా ఆవహించుకుంది. నిట్టూర్పులతో అక్కడి వాతావరణమంతా వేడిగా మారిపోయింది.

భూషణం భార్యకి దగ్గరగా వచ్చాడు.

''జ్ఞాపకం వుందా ఆరోజు''అన్నాడు నవ్వుతూ.

''ఆ. చాలా బాగా వుంది. ఎందుకట ఇప్పుడా విషయం'' అంది ధనలక్ష్మి.

''అమ్మాయ్ లతా!'' అంటూ కోడలి గదివైపు నడిచాడు భూషణం.

* * *

''రామకృష్ణుడు గారెవరండీ ఇక్కడ?'' అంటూ ఆఫీస్‌లోకి ప్రవేశించాడొక వ్యక్తి.

కుడిఎడమల ఫైళ్ళ మేరుపర్వతాల మధ్య అస్తమిస్తున్న సూర్యుడిలా కూర్చుని వున్నాడు రామకృష్ణుడు. ఫైళ్ళ మధ్యలోంచి తల బయటకు పెట్టి ''ఎవరూ!'' అంటూ తొంగి చూసాడు.

ఆ వచ్చిన వ్యక్తి ఒక ఉత్తరం రామకృష్ణుడికిచ్చి

13-3-92 ఆంధ్రజ్యోతి వార పత్రిక

నిలబడ్డాడు. ఉత్తరం మడత విప్పి చదవడం మొదలుపెట్టాడు రామకృష్ణుడు.

"మిస్టర్ రామకృష్ణుడు! ఏ దొంగ కోసం ఇన్నాళ్ళూ మా డిపార్ట్‌మెంట్ వేయి కళ్ళతో గాలిస్తోందో, ఆ పేరుమోసినగజదొంగ చండీరాణి ఉరఫ్ లతాదేవిని మీరీమధ్యనే వివాహమాడారని తెలిసింది. ఆమెను ఇప్పుడే అరెస్టు చేశాం. మీరూ ఆమె ముఠా మనుషులన్న అనుమానంతో మీకిస్తున్న అరెస్టు వారెంటిది. ఈ నేరానికి మీకు శిక్ష ఏమిటో తెలీదనుకుంటాం. కదలడానికి వీలు లేకుండా బంధించి ఊపిరిసలపకుండా ఒళ్ళంతా వాతలుపెట్టి ఆమె తాలూకు రహస్యాలన్నీ మీ ద్వారా బట్టబయలు చేయించాలనుకుంటున్నాం. కాబట్టి మీరు మాట్లాడకుండా మఫ్టీలో వున్న మా కానిస్టేబుల్‌తో బాటు కారు దగ్గరకు రండి".

ఉత్తరం చదివిన రామకృష్ణుడి ముఖం పాలిపోయింది. ఒళ్ళంతా మంచు ముద్దలా చల్లబడిపోయింది.

"ఆ ఒక్క ఫైలూ పూర్తిచేసి పోరాదూ!" అంటూ ముందుకొచ్చిన ఆఫీసరు అతని చేతిలోని ఉత్తరం చదివి,కంగారుపడి ఎక్కడ తనకి కూడా ఆ ముఠాతో సంబంధం అంటకడ్తారో అని భయపడుతూ అతడ్ని వెంటనే వెళ్లిపొమ్మని పంపించేశాడు.

తడబడుతున్న అడుగులతో బయటకు నడిచాడు రామకృష్ణుడు. బయట అంబాసిడర్ కారు ఆగివుంది. భయం భయంగా వెళ్ళి కారు దగ్గర నిలబడ్డాడు. వెంటనే కారు డోర్ తెరుచుకుంది.

దాంట్లోంచి ఒక చెయ్యి రామకృష్ణుడ్ని కార్లోకి బలంగా లాగింది. అతను తూలిపడి కారులో వున్న వ్యక్తి ముఖం చూసి ఆశ్చర్యంతో అవాక్కయిపోయాడు.

* * *

మర్నాడు యధావిధిగా ఆఫీసుకి హాజరైన రామకృష్ణుడ్ని చూసి అంతా తెల్లబోయారు.

"ఏమిటయ్యా ఇలా వచ్చేశావ్! పోలీసులు నిన్ను అరెస్టు చెయ్యలేదా!" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు ఆఫీసరు.

రామకృష్ణుడు సిగ్గుపడుతూ, "అరెస్ట్ చేసింది పోలీసులు కాదు సార్! మా ఆవిడ!" అన్నాడు.

"హా.... మరి మీ ఆవిడ దొంగ అని వ్రాశారు కదా ఆ అరెస్టు వారెంటులో".

"ఆమె నా మనసు దోచుకుని దొంగ అయిందట సార్".


"చాలా బావుందే! మరి నీ వొంటిమీద వాతలేమీ కనపడవేం?" అంటూ అద్భుత ఆశ్చర్య రసాలను కలబోసుకు మాటలు సాగదీశాడు ఆఫీసరు.

"అవి....అవి కనబడని ముద్రలు సార్" అంటూ సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు రామకృష్ణుడు.

"హాశ్చర్యంగా వుందే!!" అంటూ ఆఫీసర్‌తో బాటు అంతా కోరస్ పాడారు.


## బాబా చెప్పిన కథలు

### డాంబికం



ఒక వూరిలో పేద ముదుసలి వుండేది. ఉన్నా లేకపోయినా డాంబికం ఎక్కువ, తనని తన పనులను నలుగురూ చూడాలని, పొగడాలని అలా అందరి దృష్టి తనపైనే వుండాలని ఆశించేది.

అదే కోరికతో ఎంతో కష్టపడి కొంత ధనాన్ని కూడబెట్టి, చేతికి బంగారు మురుగులు చేయించుకుంది. రెండు చేతులకు ధరించింది. గ్రామస్తులు గాని, ఆ చుట్టుపక్కలవారు గాని ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. తన మురుగుల కేసి ఎవరూ చూడడం లేదు.



ఇలా ఎన్నో ప్రయత్నాలు చేసి విసుగుచెందింది. చివరగా తన బుర్రకు ఒక ఆలోచన వచ్చింది. లాభనష్టాలను కూడా లెక్కచేయకుండా ఆ ప్రయత్నం కూడా చేయదలచుకుంది.

ఏమిటంటే, తాను వుంటున్న పాకకు నిప్పు పెట్టుకోవడం. అప్పుడు వూరి వారందరు సాయం చేసే ప్రయత్నంలో తన ఇంటి చుట్టూ మూగుతారు, అప్పుడైనా తన మురుగులను చూడకపోతారా అనే ఆశ.

అనుకున్న ఆలోచన ప్రకారం ఓ శుభముహూర్తంలో ఇంటికి స్వయంగా నిప్పు పెట్టుకున్నది. ఆశించిన విధంగానే జనం తన ఇంటి చుట్టూ మూగారు. రెండు చేతులూ ఎత్తి బిగ్గరగా అరవడం ప్రారంభించింది, 'అయ్యో! నా గుడిసె, కాలిపోతూందే' అని. అయినా అందరూ మంటలను ఆర్పే ప్రయత్నమో మరో ఇతర సాయమో చేస్తున్నారుగాని, ఆమె చేతులను ఎవరూ చూడడం లేదు. ఆ బంగారు మురుగుల సంగతి ఎవరూ పట్టించుకోడంలేదు. ఇలా ఆమె చివరి ప్రయత్నం కూడా వ్యర్థం అయింది.

శ్రీ సత్యసాయి మనకు ఈ కథ చెపుతూ భావపూరితంగా ఇలా అంటారు మనం ఏ పని చేసినా మన మనస్ఫూర్తిగా చేయాలికాని, ఇతరుల దృష్టిని ఆకర్షించడానికి చేయకూడదు.

ఇతరుల దృష్టిని ఆకర్షించడానికి చేసే పనులు వ్యర్థం. వాటివల్ల ఉపయోగం లేదు. పైగా ఇతరులను ఆకర్షించడానికి చేసే పనులు అనర్థహేతువులు అవుతాయి అంటారు!